సాక్షి ఆదిలాబాద్

గురువారం : 16 : ఫిబ్రవరి : 2023



పోదామా.. 'గట్టు' జాతరకు..
జైపూర్ మండలంలోని వేలాల మల్లికార్జున స్వామి జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని మూడు రోజులపాటు జాతర నిర్వహిస్తారు. 8లో▸



ఆహార భద్రతలో రైతుల పాత్ర కీలకం
ఆహార భద్రతలో రైతుల పాత్ర కీలకమని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రంలో రేడియో కిసాన్ దివస్ నిర్వహించారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
36.0 /16.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రివేళ చలి తీవ్రత ఉంటుంది. వేకువజామున పొగ మంచు కనిపిస్తుంది. పగటిపూట ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు బీసీ కుల సంఘాలతో సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని 34 బీసీ కుల సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో నిర్వహించే సమావేశానికి జిల్లాలోని ఆయా కుల సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జాబ్‌మేళా వినియోగించుకోవాలి

కైలాస్‌నగర్: నిరుద్యోగ యువతకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 16న ఉదయం 10గంటల నుంచి జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ పీ శ్రీజ సూచించారు. బుధవారం డీఆర్డీఏ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి జాబ్‌మేళా నిర్వహణపై చర్చించారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పదో తరగతి పాసైన అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఆయా కంపెనీలు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తాయని వివరించారు.

కారుణ్య నియామకాల్లో కదలిక

సాక్షి,ఆదిలాబాద్: కారుణ్య నియామకాల్లో కదలిక వచ్చింది. పెండింగ్ దరఖాస్తులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈనెల 8న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ మరణించిన వారి సంబంధీకులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం కల్పించడం జరుగుతుంది. దీనికి సంబంధించి ఆదిలాబాద్ జిల్లాలో 24 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్లకు సన్మానం



సన్మాన గ్రహీతలతో బార్ అసోసియేషన్ ప్రతినిధులు

కైలాస్‌నగర్: లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సిస్టంలో భాగంగా నూతనంగా నియమితులైన డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్లను బుధవారం ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కోర్టు ప్రాంగణంలోని అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గంగారాం దాసరి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అరుగుల అశోక్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉమేశ్‌రావు జోలేను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, కార్యదర్శి చందుసింఘ్, ఉపాధ్యక్షుడు వెంకట్‌కుమార్, సంయుక్త కార్యదర్శి భద్రేశ్వర్, కోశాధికారి రమణ, న్యాయవాదులు బిపిన్‌కుమార్ పటేల్, మంజులత, చంద్రమోహన్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న క్షమా దేశ్‌పాండే

తాంసి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే సూచించారు. బుధవారం మండలంలోని బండల్‌నాగాపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించారు. అనంతరం భోజనశాల, మరుగుదొడ్లు, మూత్రశాలలు, వసతులను పరిశీలించి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మమతకు పలు సూచనలు చేశారు.

నాణ్యత తేలేదిక్కడే!



- ఆదిలాబాద్‌కు ఎఫ్‌క్యూసీఎల్ మంజూరు
- అన్నిరకాల ఫర్టిలైజర్లకు క్వాలిటీ పరీక్ష
- ఫలితం త్వరగా వచ్చే వెసులుబాటు
- సాగు సమయంలో రైతులకు ప్రయోజనకారిగా ఎఫ్‌క్యూసీఎల్
- ఇతర జిల్లాల నుంచి రానున్న శాంపిళ్లు

ఎఫ్‌క్యూసీఎల్ వివరాలు
ల్యాబ్ పేరు: ఎఫ్‌క్యూసీఎల్
పరికరం: ఆదిలాబాద్‌కు చేరింది
విలువ: రూ.62.50లక్షలు
ఏర్పాటు స్థలం: డీఏవో కార్యాలయ ఆవరణ

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్‌కు ఫర్టిలైజర్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ (ఎఫ్‌క్యూసీఎల్) మంజూరైంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాగు సీజన్‌లో ఎరువుల డీలర్ల వద్ద వ్యవసాయాధికారులు ఎరువుల నమూనాలు సేకరించి నాణ్యత పరిశీలిస్తారు. ఇప్పటివరకు ఈ పరీక్షల కోసం హైదరాబాద్ లేదా వరంగల్‌కు పంపించేవారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వచ్చే నమూనాల పరిశీలన అక్కడ జరిగే పరిస్థితి ఉండగా మన జిల్లాకు సంబంధించిన ఫలితాలు ఆలస్యంగా వచ్చేవి. ఈ కారణంగా ఒక్కోసారి డీలర్ తన దగ్గర ఉన్న ఎరువులను పూర్తిగా రైతులకు అమ్మేస్తుంటాడు. ఒకవేళ నమూనాలో నాణ్యత లేదని తేలినా అప్పటికే ఎరువు తీసుకున్న రైతు నష్టపోవడం జరుగుతోంది. త్వరలో ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ఈ ల్యాబ్‌తో వెంటవెంటనే ఎరువుల నాణ్యత ఫలితాలు వచ్చి రైతులకు సాగు సమయంలో ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

ఇతర జిల్లాల నుంచీ ఇక్కడకూ..
హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ పట్టణాల్లో ఎఫ్‌క్యూసీఎల్‌లు ఉన్నాయి. ఇదివరకు మన జిల్లా నుంచి ఎరువుల నమూనాలను హైదరాబాద్‌కు పంపేవారు. అలాగే వరంగల్, కరీంనగర్ జిల్లాలకు కూడా ఇతర జిల్లాల నమూనాలు వెళ్లేవి. కొత్తగా ఆదిలాబాద్ జిల్లాలో దీనిని ఏర్పాటు చేస్తుండగా చుట్టుపక్కల జిల్లాల నమూనాలు ఇక్కడికి వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నమూనాల పరిశీలన ఇదే ల్యాబ్‌లో జరగనున్నాయి.

రాష్ట్రంలో నాలుగోది
ఫర్టిలైజర్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌లు ప్రస్తుతం హైదరాబాద్, వరంగల్‌లో ఎన్నో ఏళ్లుగా ఉన్నాయి. ఏడాది క్రితం కరీంనగర్‌లో ఏర్పాటు చేశారు. తాజాగా ఇది ఆదిలాబాద్‌కు మంజూరైంది. సాగు సీజన్‌లో రైతులు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాషియం, భాస్వరం, నత్రజని ఎరువులతో పాటు నీళ్లలో కరిగే ఇతర ఎరువులను కూడా వాడుతారు. సాధారణంగా ఆ ఎరువు తయారయ్యే కంపెనీ వద్ద మొదట నాణ్యత పరిశీలన ప్రక్రియ పూర్తవుతుంది. ఆ తర్వాత వ్యాగన్ల ద్వారా ఇతర ప్రాంతాలకు ఎరువు చేరుకున్నప్పుడు అక్కడా నాణ్యత పరిశీలిస్తారు. ఆ తర్వాత డిస్ట్రిబ్యూటర్ల వద్ద ఈ పరీక్ష నిర్వహిస్తారు. తదుపరి డీలర్ వద్ద కూడా ఈ పరీక్ష చేయడం ద్వారా కంపెనీలో తయారైన నాణ్యత డీలర్ వద్ద కూడా అదే ప్రమాణాల్లో ఉందా.. లేదా అనేది తేలుతుంది. తద్వారా పంట ఎదుగుదల కోసం ఎరువులను వాడే రైతులకు ఇది ఎంతో ఉపయుక్తం కానుంది. వ్యవసాయ భూముల్లో సారాన్ని పరీక్షించేందుకు భూసార పరీక్షల మాదిరిగా ఎరువుల్లో నాణ్యతను పరిశీలించేందుకు ఈ ల్యాబ్ తోడ్పడనుంది. తద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

డీఏవో కార్యాలయ ఆవరణలోనే..



జిల్లా కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలోని ఓ గదిలో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తాం. వ్యవసాయశాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం నుంచి ఈ ల్యాబ్ మంజూరుకు సంబంధించి ఉత్తర్వులు ఇటీవలే వచ్చాయి. త్వరగా దీన్ని ఏర్పాటు చేసి రైతులకు మేలు జరిగేలా చూస్తాం.
– పుల్లయ్య, వ్యవసాయశాఖాధికారి, ఆదిలాబాద్

'పది'పై ప్రత్యేక నజర్



జైనథ్ హైస్కూల్‌లో ప్రత్యేక తరగతులకు హాజరైన ఎస్సెస్సీ విద్యార్థులు

- ఉత్తమ ఫలితాలే విద్యాశాఖ లక్ష్యం
- పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం స్పెషల్ క్లాసులు
- పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయి బృందాలు
- వారంలో రెండుసార్లు పాఠశాలల తనిఖీలు
- ఉన్నతాధికారులకు తనిఖీ నివేదికలు

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించేందుకు విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణకు నిర్ణయించింది. కొంత మంది ఉపాధ్యాయులు సరిగా బోధించడంలేదనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి బృందాలను పర్యవేక్షణ కోసం నియమించింది. ఈ బృందాలు వారానికి రెండుసార్లు జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలను తనిఖీ చేసి వివరాలు ఉన్నతాధికారులకు అందజేస్తాయి.

వారంలో రెండుసార్లు తనిఖీలు
పదో తరగతి, తొలిమెట్టు కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ జిల్లా, రాష్ట్రస్థాయి బృందాలను ఏర్పాటు చేసింది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు సంబంధించి రెండు చొప్పున రాష్ట్రస్థాయి బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాల్లో ప్రధానోపాధ్యాయులు సభ్యులుగా ఉన్నారు. వారానికి రెండురోజుల పాటు తనిఖీలు చేపడతారు. పదో తరగతి సిలబస్ పూర్తయిందా.. లేదా.. ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయా లేదా.. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఏవిధంగా దృష్టి సారించారు.. విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నారా.. లేదా.. అనే విషయాలపై ఆరా తీస్తారు. ఆ వివరాలను జిల్లా విద్యాశాఖాధికారితో పాటు రాష్ట్రస్థాయి అధికారులకు నివేదించనున్నారు. రాష్ట్రస్థాయి బృందంతో పాటు జిల్లా స్థాయిలో మూడు బృందాలు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్, బోథ్, ఉట్నూర్ డివిజన్ పరిధిలో ఒక్కో బృందం వారానికి రెండురోజుల పాటు తనిఖీ చేస్తుంది. ఒక బృందంలో నలుగురు సభ్యులు ఉంటారు. ఇద్దరు ఉన్నత పాఠశాలలు, మరో ఇద్దరు ప్రాథమిక స్థాయిలో జరుగుతున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని పరిశీలిస్తారు. ఉపాధ్యాయులు విద్యాబోధన చేపడుతున్నారా.. సక్రమంగా పాఠశాలకు వస్తున్నారా.. లేదా.. అనే విషయాలపై బృందం సభ్యులు ఆరా తీస్తారు.

ఈ నెల 15నుంచి మార్చి 30వరకు..
ఆదిలాబాద్ జిల్లాలో డీఈవో పరిధిలో 127 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో 105 జెడ్పీ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలున్నాయి. 17 కేజీబీవీలు, ఆరు మోడల్ స్కూళ్లున్నాయి. వీటిలో 5,100 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు పిల్లల చదువు కంటే ఇతర వ్యాపకాలపై దృష్టి పెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 15 నుంచి మార్చి 30 వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తనిఖీ బృందాలు పాఠశాలలను పర్యవేక్షిస్తాయి. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుపై సలహాలు, సూచనలు చేస్తాయి.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు
పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రాత్రివేళ పిల్లలు చదువుతున్నారా? లేదా? అనే విషయాలపై ఆరా తీయాలని సూచించారు. తరచూ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని, తల్లిదండ్రులు విద్యార్థులకు తోడ్పాటునందించేలా చూడాలని పేర్కొంటున్నారు. ఉదయం పిల్లల్ని 5 నుంచి 6 గంటల మధ్యలో నిద్ర లేపి చదివించాలని సూచిస్తున్నారు. టీ-సాట్ ద్వారా వచ్చే తరగతులు చూసేలా చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు. ఈనెల 20 నుంచి వచ్చే మార్చి 20 వరకు టీ-సాట్ ద్వారా ప్రత్యేక తరగతులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరిస్తున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం



పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఉన్నత పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. స్నాక్స్ కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ప్రత్యేక తరగతుల నిర్వహణ, తొలిమెట్టు కార్యక్రమ పర్యవేక్షణకు రాష్ట్ర, జిల్లా స్థాయి బృందాలు తనిఖీలు చేపట్టనున్నాయి. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తాం.
– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

కళా నైపుణ్యాలు వెలికితీయాలి

ఉట్నూర్: గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత కళా నైపుణ్యాలు వెలికితీయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు దిలీప్‌కుమార్ సూచించారు. బుధవారం కేబీ ప్రాంగణంలో నిర్వహించిన ఉట్నూర్ డివిజన్ స్థాయి స్పోర్ట్స్ కల్చరల్ ఫెస్ట్-2023లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డివిజన్ల వారీగా కల్చరల్ ఫెస్ట్ నిర్వహించామన్నారు. స్పెల్ బీ, డ్రాయింగ్, పెయింటింగ్, రంగోళి, పాటలు, వ్యాసరచన, డ్యాన్స్, క్విజ్, మాక్ పార్లమెంట్ తదితర తొమ్మిది విభాగాల్లో పోటీలు నిర్వహించామని తెలిపారు. ఉట్నూర్ డివిజన్‌లోని 20 ఆశ్రమ పాఠశాలలకు చెందిన దాదాపు 400 మంది గిరిజన విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మిషన్ లక్ష్యం, అక్షర జ్యోతి కార్యక్రమాలు పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతిలో వందశాతం ఫలితాలు వచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఏటీడీవో క్రాంతికుమార్, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

మాట నిలబెట్టుకోని సీఎం కేసీఆర్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్

ఆదిలాబాద్: సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని రాంపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజలను సీఎం కేసీఆర్ పథకాల పేరుతో మభ్య పెడుతూ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేగా జోగు రామన్న నాలుగుసార్లు గెలిచినప్పటికీ స్థానికంగా ఒరగబెట్టిందేమీలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో మోసగాళ్లకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల ప్రవీణ్, జోగు రవి, ధోని జ్యోతి, వేదవ్యాస్, ముకుంద్‌రావు, నగేశ్‌రెడ్డి, శక్తి కేంద్ర అధ్యక్షులు, పోలింగ్ సభ్యులు, కార్యకర్తలున్నారు.

జైనథ్ మండల కేంద్రంలో..
జైనథ్: మండల కేంద్రంలో శక్తి కమిటీ కార్నర్ మీటింగ్ నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే పింఛన్‌ను రూ.3వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని బీఆర్ఎస్‌ను నమ్మి మరోసారి మోసపోవద్దని సూచించారు. బీజేపీని ఆదరించాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, నాయకులు చిట్యాల సుహాసినీరెడ్డి, లోక ప్రవీణ్‌రెడ్డి, భోయర్ విజయ్, కంది శ్రీనివాస్‌రెడ్డి, అస్తక్ సుభాష్, కట్కం రాందాస్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్: మాట్లాడుతున్న పాయల్ శంకర్

బేల మండలం సైద్‌పూర్‌లో..
బేల: మండలంలోని సైద్‌పూర్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాగోస- బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ హాజరయ్యారు. పలువురు పార్టీలో చేరగా కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. పార్టీ మండలాధ్యక్షుడు దత్తా నిక్కమ్, నాయకులు రామెల్లి మోరేశ్వర్, ఠాక్రే సందీప్, బర్కాడే రాము, పోత్రాజ్ నవీన్, సురేశ్ పాల్గొన్నారు.

ఆ అక్రమ నిర్మాణాల వెనుక..

- ఉద్యోగ సంఘం నేతనే.. సూత్రధారి!
- అక్రమార్కుడికి అండగా అధికారులు
- భూ కేటాయింపు లేకుండా కట్టడాలు
- ఉన్నతాధికారుల ఆదేశాలతో వెనక్కి..



ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆగిన అక్రమ నిర్మాణాలు

కైలాస్‌నగర్: మావల మండల శివారు, ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్ సమీపంలోని అసైన్డ్ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాల వెనుక ఓ ఉద్యోగ సంఘం నేత ప్రమేయమున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ భూమిని అధికారికంగా ఎవరికీ కేటాయించలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అయినా దానిని ఆక్రమించి దర్జాగా నిర్మాణాలు చేపట్టడం వెనుక కొంతమంది రెవెన్యూ అధికారుల అండదండలున్నాయనే ఆరోపణలున్నాయి. ఇంటి స్థలాల పేరిట తోటి ఉద్యోగుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసిన సదరు సంఘం బాధ్యుడు రెవెన్యూ అధికారుల చేయి తడపడంతోనే వారు ఈ వ్యవహారంలో అండగా నిలిచినట్లు తెలుస్తోంది.

ప్లాట్లుగా విభజించి పంపకాలు
దుర్గానగర్ సమీపంలోని సర్వే నంబర్ 21లోని అసైన్డ్‌భూమిని ఇటీవల కొంతమంది ఆక్రమించారు. ప్లాట్లుగా విభజించి పంపకాలు చేపట్టారు. వాటిని సొంతం చేసుకోవాలనే వ్యూహంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి ఇంటి నంబర్ పొందేందుకు అక్కడ చిన్నపాటి నిర్మాణాలు ప్రారంభించారు. ఈ దందాకు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన, నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలో పనిచేసే ఓ ఉద్యోగ సంఘం బాధ్యుడు సూత్రధారిగా ఉన్నారనే విమర్శలున్నాయి. అధికారికంగా ఎలాంటి పదవి లేనప్పటికీ తనకు తాను అధ్యక్షుడిగా ప్రకటించుకున్న సదరు వ్యక్తి ఆ స్థలంలో ప్లాట్లు ఇప్పిస్తానని నమ్మబలికి కొందరు సహచర ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. ఒక్కో ప్లాట్‌కు తొలుత ఇంటి నిర్మాణానికి రూ.40వేలు, స్థలాన్ని చదును చేసేందుకు రూ.10వేలు, మున్సిపల్ నుంచి హౌస్ టాక్స్ (ఇంటినంబర్లు)ను ఇప్పించేందుకు రూ.70వేలు ఇలా ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.1.20లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇందులో రెవెన్యూ అధికారులకు సదరు ఉద్యోగ సంఘం నాయకుడు భారీగానే ముడుపులు ముట్టజెప్పారనే ఆరోపణలున్నాయి. దీనిపై అధికారులు, సంఘం బాధ్యుడికి మధ్య డీల్ కుదిరినట్లుగా చర్చ సాగుతోంది. ప్లాట్ ఓకే అయి మున్సిపల్ నుంచి హౌస్ నంబర్లు వచ్చాక పెద్ద మొత్తంలో ముడుపులు అందించేలా ఒప్పందం జరిగిందనే ప్రచారం జరుగుతోంది.

బెడిసికొట్టిన వ్యూహం
ఈ వ్యవహారం జిల్లా ఉన్నతాధికారులకు తెలియగా సదరు సంఘం నాయకుడి వ్యూహం బెడిసికొట్టినట్లయింది. వ్యవహారం కలెక్టర్ దృష్టికి వెళ్లగా ఆయన దీనిపై సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ఆ నిర్మాణాలను ఆపాల్సిందిగా ఆదిలాబాద్ ఆర్డీవోతోపాటు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించినట్లు సమాచారం. అప్పటివరకు అక్రమార్కుడికి వంతపాడిన సంబంధిత అధికారులు కలెక్టర్ ఆదేశాలతో విధిలేని పరిస్థితుల్లో రంగంలోకి దిగాల్సి వచ్చింది. తప్పనిసరి పరిస్థితుల్లోనే అధికారులు అక్కడికి చేరుకుని ఆ నిర్మాణాలు నిలిపివేయాల్సి వచ్చిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూ కబ్జా విషయం ఉన్నతాధికారుల వరకు వెళ్లగా సంఘం బాధ్యుడు చేసేదేమీలేక నిర్మాణాలు నిలిపేసి పలాయనం చిత్తగించినట్లు ఉద్యోగ, రెవెన్యూ వర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది.

ఎలాంటి అనుమతులివ్వలేదు
ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్‌లోని 37గుంటల భూమిని 2011లో ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్‌కు కేటాయించారు. అయితే కేటాయింపులు చేసినట్లు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. వారికి పట్టాలు కానీ.. ప్లాట్ల విభజన గాని జరగలేదు. అక్కడ నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదు. అందుకే నిర్మాణాలు నిలిపివేశాం.
– కే.వనజారెడ్డి, తహసీల్దార్, మావల

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా

బోథ్: పెద్ద వాగు నుంచి మోటర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కనుగుట్ట, పొచ్చర సబ్‌స్టేషన్ వద్ద బుధవారం రైతులు ధర్నా చేశారు. పెద్ద వాగు ఎగువన రైతులు మోటర్లు బిగించి నీళ్లు తోడడంతో దిగువనున్న తమ భూములకు నీరు అందడం లేదని వాపోయారు. పశువులు తాగడానికి కూడా నీరు లేని పరిస్థితి ఉందని తెలిపారు. వెంటనే మోటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు.



సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

క్లుప్తంగా

బేల ఎంపీడీవో హఠాన్మరణం


భగత్ రవీందర్ (ఫైల్)

బేల: స్థానిక ఎంపీడీవో భగత్ రవీందర్ (52) బుధవారం హఠాన్మరణం చెందారు. జిల్లా కేంద్రంలో నివాసముండే ఆయన బుధవారం తెల్లవారుజామున ఇంటి వద్ద గుండెపోటుకు గురయ్యారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎంపీడీవో హఠాన్మరణంపై మండలవాసులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయా మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఆయాశాఖల అధికారులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్న, ఆదిలాబాద్ ఆర్డీవో రాథోడ్ రమేశ్, డీఆర్డీవో కిషన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. రవీందర్ 20 జూన్ 2020 నుంచి బేల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు.

వంతెన పైనుంచి లారీ బోల్తా


బోల్తాపడ్డ లారీ

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్–తిమ్మాపూర్ గ్రామ సమీపంలో బుధవారం వంతెనపై నుంచి గ్రానైట్ (రాళ్ల)తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఖమ్మం నుంచి రాజస్థాన్ వైపు వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న బైక్‌ను తప్పించబోయి బోల్తాపడినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనలో లారీడ్రైవర్ ముఖేశ్, క్లీనర్ బేరూలాల్‌లు క్షేమంగా బయటపడ్డారు.

మిస్సింగ్ కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన 50 ఏళ్లున్న వ్యక్తి అదృశ్యమైనట్లు వన్‌టౌన్ ఎస్సై హసన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ కాలనీలో నివాసముంటున్న షేక్ సోహెల్ తండ్రి షేక్ షకీల్ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే మంగళవారం సైకిల్‌పై ముగ్గు అమ్మేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో బుధవారం వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పోదామా.. 'గట్టు' జాతరకు


గట్టుపై దొణలో స్వయంభూగా వెలిసిన శివలింగం


వేలాల మల్లికార్జున స్వామి ఆలయం

- భక్తుల కొంగు బంగారం మల్లికార్జునస్వామి
- ఈ నెల 18న మహా జాతర
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం..
- తరలిరానున్న 4 లక్షలకుపైగా భక్తులు

జైపూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే జైపూర్ మండలం వేలాల మల్లికార్జునస్వామి ఆలయం చాలా ప్రసిద్ధి చెందింది. పిలిస్తే పలికే దేవుడిగా.. భక్తుల కోరిన కోర్కెలు తీరుస్తూ.. కొంగు బంగారంగా గట్టు మల్లన్నస్వామి వెలుగొందుతున్నాడు. ఏటా మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ జాతర నిర్వహిస్తారు. ఈనెల 18న మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మూడు రోజులు నిర్వహించనున్న జాతరకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వేలాల గ్రామాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధి

ఏటా వేలాల గట్టు మల్లన్నస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. గుట్టపై స్వయంభూగా స్వామి వారు వెలిసిన దొణను ఈసారి వెడెల్పు చేశారు. గుట్టపై భక్తులకు సర్వదర్శనం కల్పించడానికి గుట్టను కొంత భాగం తొలిచి వెడెల్పు చేశారు. ఈ ఏడాది జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి సుమారు 4 లక్షలకుపైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

మూడు రోజులపాటు జాతర..

మూడు రోజులపాటు సాగే జాతరలో మొదటి రోజున గ్రామ సమీపంలోని గుట్టపై దొణలో స్వయంభూగా వెలిసిన గట్టు మల్లన్నస్వామికి మొక్కులు చెల్లిస్తారు. ఈ సందర్భంగా ఇక్కడ జన జాతర కొనసాగుతుంది. రాత్రంతా భక్తులు జాగారం చేస్తారు. వేదపండితులు, ఒగ్గు పూజారులు సంప్రదాయబద్ధంగా శ్రీమల్లికార్జున స్వామి భ్రమరాంభికలకు పట్నం వేసి వైభవంగా కల్యాణం జరిపిస్తారు. మరుసటి రోజు గ్రామంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయం వద్ద రెండో రోజున జాతర సాగుతోంది. భక్తులు గుట్టపై నుంచి కిందకు చెరుకుని స్వామికి మొక్కులు చెల్లించుకుని బోనాలు పోసి పట్నాలు వేసి మొక్కులు తీర్చుకుంటారు. మూడో రోజున జాతరను ముగిస్తారు.


తొలిచిన దొణ(వెడల్పు చేసిన దృశ్యం)

చెలిమ నీరే తీర్థం

గట్టు మల్లన్నస్వామి చెలిమె నీటికి ఒక ప్రత్యేకత ఉంది. చాలా ఎత్తయిన గుట్టపై గల ఒక దొణలో శివలింగం ఉండి ఆ పక్కనే ఊట చెలిమె ఉంటుంది. ఈ చెలిమెలో అన్ని కాలాల్లో నీరు ఉంటుంది. గట్టు మల్లన్నస్వామిని దర్శించుకున్న భక్తులు ఈ చెలిమె నీటిని తీర్థంగా స్వీకరిస్తారు. ఈ నీటిని తీర్థంగా తీసుకుంటే శారీరక రుగ్మతలు పోతాయని, పంటలపై చల్లతే బాగా పండుతాయని భక్తుల నమ్మకం. ఇంట్లో చల్లుకుంటే శుభాలు కలుగుతాయని నమ్ముతారు.

పూజలూ ప్రత్యేకమే..

ఇక్కడ పూజలు బ్రహ్మణులు చేపడుతున్నప్పటికీ ఒగ్గు పూజారులు వారి సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహిస్తారు. పెద్దపట్నం వేసి శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం మహోత్సవం, నాగవెల్లి జరిపిస్తారు. ఇక్కడికి వచ్చే భక్తులు ఒగ్గు పూజారులతో మల్లికార్జున స్వామికి పట్నాలు వేయించి పట్టువస్త్రలు సమర్పించడం ఇక్కడ ప్రత్యేకత.

200 ఏళ్ల చరిత్ర

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం గోదావరి నది తీరంలోని వేలాల గ్రామంలో గత 200 ఏళ్ల క్రితం శ్రీమల్లికార్జునస్వామి స్వయంభూగా వెలిసినట్లు స్థానిక పురాణం ఉంది. గ్రామానికి చెందిన నరహరి పోగులపుల్లు అనే పశువుల కాపరి గొర్లు, మేకలు, ఆవులను తోలుకొని గ్రామ సమీపంలోని ఒక గుట్టకు వెళ్లేవాడు. అక్కడ ఆయన ఒక దొణలో పూజలు చేసేవాడు. అతడు తోలుకెళ్లిన పశువులు మాత్రం ఎక్కడికీ వెళ్లకుండా భద్రంగా ఉండేవి. కాలక్రమంలో నరహరి పోగులపుల్లు అదృశ్యమయ్యాడు. అనంతరం గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు దొణ వద్దకు వెళ్లి పిలిస్తే దొణ నుంచి పలికేవాడు. గ్రామస్తులు వారి బాధలు చెప్పుకుంటే తీర్చేవాడు. వారి పశువులు తప్పిపోతే ఎక్కడున్నాయో అని అడిగితే కచ్చితంగా సమాచారం చెప్పేవాడు. ఒక వ్యక్తి నరహరి పోగులపుల్లును పిలిచి పలికిన వెంటనే దూషించి అవహేళన చేశాడని దీంతో అప్పటి నుంచి పలకడం మానేశాడని చెబుతారు. అప్పటి నుంచి దొణలో స్వయంభూగా వెలిసిన శివలింగాన్ని పూజిస్తూ గ్రామంలో ఆలయం నిర్మించి ఏటా మహాశివరాత్రికి మహాజాతర నిర్వహిస్తున్నారు. గొర్ల కాపర్ల (యాదవుల) ఆరాధ్యదైవమైన శ్రీమల్లికార్జున స్వామికి ఒగ్గు పూజారులు వారి సంప్రదాయంగా పట్నాలు, బోనాలు పోసి సనాతనంగా పూజలు నిర్వహిస్తున్నారు. కోరిన కొర్కెలు తీర్చే దైవంగా భావించి యాదవులతోపాటు అన్నివర్గాల ప్రజలు తమ ఇష్టదైవంగా మల్లన్నను పూజిస్తున్నారు.

గుట్టపై తాగునీటి సమస్య..

గోదావరిలో పుణ్యస్నానాల కోసం వెళ్లిన భక్తులు అక్కడ అసౌకర్యాలతో ఇక్కట్లు పడుతున్నారు. పుణ్యస్నానాల తర్వాత మండుటెండలో బోనాలు పట్టుకుని పిల్లాపాపలతో గుట్టపై కాలినడకన చేరుకుంటారు. అక్కడ తాగునీటి వసతి లేక తండ్లాడుతున్నారు. గుట్టపై ఒక్క బోరు ఉండడం.. పెద్ద వాటర్ ట్యాంక్‌లోకి నీళ్లు నింపి అందిస్తున్నారు. ఒక్కోసారి మోటారు పాడైపోవడంతో ట్యాంక్‌లోకి నీళ్లు ఎక్కడం లేదు. నీటిపంపుల వద్ద భక్తుల తోపులాటలు జరిగిన సందర్భాలున్నాయి. గుట్టపై మరో మూడు బోర్లు ఏర్పాటు చేయాలి. కింద నుంచి గుట్టపై వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి. కాలినడక వెళ్లే భక్తులకు దారిపొడువునా తాగునీరందించాలి. ఎండ వేడిమి తగలకుండా చలువ పందిళ్లు వేయాలి. ప్రధానంగా గుట్టపైన, కింద భక్తుల సౌకర్యార్థం తాత్కాలికంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. ఒగ్గు పూజారులు పట్నాలు వేసేందుకు స్థలం కేటాయించాలి.

ఆర్జీయూకేటీలో ఘనంగా సేవాలాల్ జయంతి


నివాళులర్పిస్తున్న వర్సిటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో సేవాలాల్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో వర్సిటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్, వీసీ వెంకటరమణ సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జీవితం ఆదర్శనీయమన్నారు. అనంతరం భోగ్‌బండారో కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్ డా విఠల్, సభ్యులు డా వినోద్, విజయ్‌కుమార్, నరేందర్ నాయక్, వర్సిటీ టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు, విద్యార్థులు ఉన్నారు.

కలప స్వాధీనం


స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

మామడ(నిర్మల్): మండలంలోని దిమ్మదుర్తి, నల్దుర్తి, న్యూసాంగ్వి, వెంకటాపూర్‌తండా, కొరిటికల్ గ్రామాల్లో బుధవారం అటవీ, పోలీస్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన కలపను స్వాధీనం చేసుకున్నారు. దిమ్మదుర్తి గ్రామానికి చెందిన అల్లెపు భూమన్న ఇంటివద్ద వన్యప్రాణులను హతమార్చేందుకు ఉపయోగించే వల, దుప్పికొమ్ములు లభ్యం కావడంతో అధికారులు కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో దిమ్మదుర్తి, మామడ ఎఫ్‌ఆర్‌ఓలు పుండలిక్, అవినాష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'సదర్మాట్' నిర్మాణంలో ప్రభుత్వం విఫలం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్, కడెం మండలాల రైతుల జీవనాధారమైన సదర్మాట్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీరందించేందుకు ప్రత్యేక కాలువ నిర్మించడంలో ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఖానాపూర్ మండలం మేడంపల్లి వద్ద నిర్మించాల్సిన సదర్మాట్ బ్యారేజీని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నియోజకవర్గంలోని పొన్కల్‌కు తరలించి ఇక్కడి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. పొన్కల్ నుంచి ఖానాపూర్ వరకు ప్రత్యేక కాలువ నిర్మిస్తామని చెప్పిన కేసీఆర్ తర్వాత దానిని విస్మరించారన్నారు. ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్ చేస్తామన్న హామీ కూడా నెరవేరలేదన్నారు.

డిగ్రీ కళాశాల రాకుండా అడ్డుకుంటున్న ఎమ్మెల్యే

ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ తన ప్రైవేట్ కళాశాలల వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఖానాపూర్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాకుండా అడ్డుకుంటున్నారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. పాలకుల వైఫల్యంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెంబి మండలంలోని పసుపుల వంతెన కొట్టుకుపోవడానికి ప్రభుత్వ అవినీతి, అక్రమాలే కారణమన్నారు. నిజాం కాలంనాటి వంతెనలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయని, ఐదేళ్ల క్రితం నిర్మించిన పసుపుల బ్రిడ్జి మాత్రం కొట్టుకుపోయిందంటే పనుల్లో నాణ్యత, పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. రూ.36 వేల కోట్లతో ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు ఇస్తున్నామని చెబుతున్న కేసీఆర్ ప్రకటనలు బూటకమని, పెంబి మండలంలో ఒక్క గ్రామానికి కూడా భగీరథ నీరు రావడం లేదన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్, జిల్లా ఇన్‌చార్జి బన్సీలాల్ రాథోడ్, జిల్లా మహిళా కన్వీనర్ ఎస్కే లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండా సతీశ్, అసెంబ్లీ అధ్యక్షుడు కుక్కరికారి రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి హామీలపై సినిమా తీయొచ్చు

పెంబి: సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చే హామీలను కామెడీ సినిమా తీయవచ్చని, వచ్చిన ఆదాయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయవచ్చని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎద్దేవా చేశారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా మందపల్లి, తాటిగూడ, ఇటిక్యాల్, పసుపుల, లోతర్యతాండ గ్రామాల్లో పర్యటించారు.

అధికారంలోకి వస్తే రూ.5 వేల కోట్లు కేటాయిస్తా

ఖానాపూర్: బీఎస్పీ అధికారంలోకి వస్తే బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూ.5వేల కోట్లు కేటాయిస్తానని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా గాంధీ నగర్ కాలనీలో ఆయన మాట్లాడుతూ అలా చేయకుంటే దుబాయిలోని బుర్జుఖలీఫా పై నుంచి తనను తోసేయాలన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూ.500ల కోట్లు ఇస్తానని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ ఐదు పైసలుకూడా ఇవ్వలేదన్నారు.

కేసీఆర్ ఒక్క హామీ నెరవేర్చలేదు

- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు


బుగ్గారం(బీ)లో మాట్లాడుతున్న బాపూరావు

నేరడిగొండ: గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు ఆరోపించారు. బుధవారం మండలంలోని బుగ్గారం(బీ) గ్రామంలో నిర్వహించిన ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిని దళితుడిని చేస్తానని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని కేసీఆర్ దళితులను మోసం చేశారని విమర్శించారు. ఇన్నేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ ఇప్పుడు బీఆర్ఎస్ పేరుతో దేశాన్ని దోచుకోవడానికి బయల్దేరారని ఆరోపించారు. కేంద్రం నిధులతోనే తెలంగాణలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. సీసీ రోడ్లు, రైతు వేదికలు, డంప్‌యార్డులు, వైకుంఠధామాల నిర్మాణాలతో పాటు గ్రామపంచాయతీల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని వివరించారు. కుప్టి ప్రాజెక్ట్ విషయంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. ఆయన గ్రామాల్లో టెంకాయలు కొట్టడానికే పనికొస్తున్నారని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో డబుల్ ఇంజిన్‌పాలన వస్తేనే తెలంగాణలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. అంతకు ముందు బీజేపీ జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఆడె మానాజీ, మండల ఇన్‌చార్జి ఆమ్టి, అసెంబ్లీ కన్వీనర్ సూర్యకాంత్ గిత్తే, మండల కన్వీనర్ హీరాసింగ్, నాయకులు జాదవ్ పరశురాం, చొక్కపెల్లి రాములు, గట్టు నారాయణ, రాథోడ్ రాజేశ్వర్, సాబ్లే సంతోష్‌సింగ్, గంధం నవీన్, ప్రశాంత్, సర్పంచ్ రేణాబాయి, పెంబీ జెడ్పీటీసీ జానుబాయి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉత్సవాలకు పెద్దపీట

- జెడ్పీ అధ్యక్షులు కోవ లక్ష్మి, రాథోడ్ జనార్దన్
- కెరమెరిలో ఘనంగా రామారావు మహరాజ్ విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్


గోధుమ బుట్టలతో కుమురంభీం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

కెరమెరి(ఆసిఫాబాద్): గిరిజన ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లా పరిషత్ అధ్యక్షులు కోవ లక్ష్మి, రాథోడ్ జనార్దన్ అన్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రీసంత్ సద్గురు రామారావు మహరాజ్ విగ్రహాన్ని బుధవారం ప్రేంసింగ్ మహరాజ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపస్వీ రామారావు మహరాజ్ అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. కెరమెరి మండలంలోని శంకర్‌లొద్ది, జంగుబాయి పవిత్ర స్థలాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్‌తో మాట్లాడతామని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రామారావు మహరాజ్ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గోధుమ బుట్టలు నెత్తిన పెట్టుకుని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి చిన్నారుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, సర్పంచులు భైనాబాయి, శేశారావు, ఎంపీటీసీ సంగీత, సేవాలాల్ ఉత్సవ కమిటీ చైర్మన్ రవి, గౌరధ్యక్షుడు రాథోడ్ శంకర్‌నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ రాథోడ్, నాయకులు రాథోడ్ ఉత్తం నాయక్, లాల్‌సింగ్, వెంకటి, వెంకట్రావ్, శివాజీ, దస్రు, లాలు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిని బలిగొన్న రోడ్డు ప్రమాదం

- లారీ ఢీకొని యువకుల దుర్మరణం
- మరో యువకుడికి తీవ్ర గాయాలు
- డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం


దత్తా (ఫైల్)


ఫిరోజ్ (ఫైల్)


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న నగేశ్


ప్రమాదస్థలిలో మృతదేహాలు

ఆదిలాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు ఇద్దరిని కబళించింది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేల మండలం సిర్సన్న గ్రామానికి చెందిన ఫిరోజ్ (29) తలమడుగు మండలం దేవాపూర్ గ్రామంలో కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. గ్రామంలో కుటుంబ సభ్యులు కిరాణా షాప్ నిర్వహిస్తుండగా ఫిరోజ్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దుకాణంలో పని చేస్తున్నాడు. బుధవారం తన ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్‌కు బయల్దేరాడు. మావల సమీపంలో జాతీయ రహదారిపై తమిళనాడు నుంచి ఉత్తరప్రదేశ్ వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే సమయంలో ఉట్నూర్ మండలం లక్కారాం గ్రామానికి చెందిన బావా బామ్మర్దులు దత్తా (35), నార్నూర్ మండలానికి చెందిన బౌనే నగేశ్ ఉదయం ఉట్నూర్ నుంచి ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ పట్టణానికి వడ్రంగి పని కోసం వస్తున్నారు. ఇదే క్రమంలో నగేశ్‌కు ఫోన్ రావడంతో మావల సమీపంలో జాతీయ రహదారికి రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాన్ని నిలిపి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నాడు. కాగా, ఫిరోజ్‌ను ఢీకొట్టిన లారీ రోడ్డు పక్క నిలిబడి ఫోన్ మాట్లాడుతున్న దత్తా, నగేశ్‌పైకి దూసుకెళ్లింది. దీంతో దత్తాకు తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. నగేశ్ కాలుకు స్వల్ప గాయం కావడంతోపాటు భుజం విరిగింది. అతడిని వెంటనే జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. దత్తాకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఫిరోజ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారి కుటుంబ సభ్యుల రోదనలు అక్కడి వారిని కలిచివేశాయి.

డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందడానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. డ్రైవర్ భోజనం చేస్తూ వాహనాన్ని నడుపుతున్నట్లు తెలిసింది. పోలీసులు లారీని స్వాధీనం చేసుకున్నారు. మృతుల కుటుంబాల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 13 మంది డిబార్

కైలాస్‌నగర్: కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్షలు ఈ నెల 9నుంచి కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన పరీక్షలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 13మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. కాగజ్‌నగర్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాల ఒకరు, రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఆదిలాబాద్ పట్టణంలోని నలందా డిగ్రీ కళాశాలల్లో ఒక్కొక్కరు చొప్పున డిబార్ అయ్యారు. అలాగే, ఖానాపూర్‌లోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, కేఎస్ఆర్‌లో ఒకరు, ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఐదుగురు, ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు చూచిరాతలకు పాల్పడుతుండగా పట్టుకుని డిబార్ చేసినట్లు కేయూ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

కూతుర్ని హతమార్చిన తండ్రికి జీవితఖైదు

నిర్మల్‌టౌన్: కూతుర్ని హతమార్చిన కసాయి తండ్రికి నిర్మల్ న్యాయస్థానం జీవిత ఖైదు, జరిమానా విధించింది. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మోకల్వాడ్ వెంకప్ప 2016లో బతుకుదెరువుకోసం కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్‌కు వచ్చాడు. ఉంగరాల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. అతనికి ముగ్గురు పిల్లలు సంతానం. పెద్ద కూతురు భాగ్యశ్రీ (6) పుటుకతోనే దివ్యాంగురాలు. రెండేళ్ల క్రితం అతని భార్య శ్రీదేవి దివ్యాంగురాలైన కుమార్తెను అతనివద్ద వదిలేసి మిగిలిన ఇద్దరు పిల్లలను తీసుకుని కర్ణాటకలోని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో కూతురుకి సేవలు చేయలేక వెంకప్ప విసుగెత్తిపోయాడు. కూతుర్ని తల్లివద్ద వదిలేసి వస్తానని చెప్పి 2019, ఆగస్టు 15న సాయంత్రం ఇంటినుంచి బయలుదేరిన వెంకప్ప భాగ్యశ్రీని ఒక చెద్దరులో చుట్టి జిల్లా కేంద్రంలోని ధర్మసాగర్ చెరువులో విసిరేశాడు. విషయం తెలుసుకున్న ప్రియదర్శినినగర్ కౌన్సిలర్ చందుపట్ల రవి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సీఐ జీవన్‌రెడ్డి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు 16 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో శిక్ష ఖరారు చేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ బుధవారం తీర్పు ఇచ్చారు.

175 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి రాంపూర్ సమీపంలో పట్టుకున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఫతేసింగ్ తెలిపారు. మంగళవారం రాత్రి రాంపూర్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో 175 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడినట్లు పేర్కొన్నారు. పట్టుబడ్డ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించామని పేర్కొన్నారు.